

ప్రముఖ వైద్యులు రాంప్రసాద్ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రముఖ ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ రాంప్రసాద్ గుండెపోటుతో గురువారం అర్ధరాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో ఇఎన్‌టి వైద్యులుగా పేరొందిన డాక్టర్ రాంప్రసాద్‌కు పలువురు ప్రముఖులతో సత్సంబంధాలున్నాయి. ఆయన మృతిపై పట్టణ ప్రముఖులు, వైద్యులు పలువురు సంతాపం తెలిపారు.



మిల్లర్ల దోపిడీ ఆగేనా..!



'కొత్తూరుకు చెందిన పల్లపోతుల రెడ్డియ్య ఖరీఫ్‌లో ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. 280 బస్తాల వరకూ రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించాడు. జట్టు, కిరాయిల నుంచి ఎన్నో ఇబ్బందులు పడి కేటాయించిన మిల్లుకు ధాన్యం తోలాడు. రైతుభరోసా కేంద్రం సిబ్బంది వద్ద తేమశాతం 16.7 రాగా, మిల్లు వద్ద 17.2 వచ్చిందని చెప్పారు. పాయింట్‌కు రూ. పది చొప్పన సొమ్ము రైతుల వద్ద నుంచి వసూలు చేశారు. తూకంలో తేడా వచ్చిందని కిలోకు రూ.20 వసూలు చేశారు. మొత్తంగా రూ.13,600 చెల్లిస్తే తప్ప ధాన్యం దింపుకోని పరిస్థితి కొనసాగింది.'

'కన్నెగంటి పూర్ణచంద్రరావుది కొత్తూరు గ్రామం. ఖరీఫ్‌లో ఏడెకరాలు సాగు చేశాడు. మొత్తం 205 బస్తాల ధాన్యం వరకూ విక్రయించాడు. మిల్లుకు వెళ్లిన తర్వాత బియ్యం ముక్క అవుతుందని బస్తాకు రూ.30 చొప్పున 180 బస్తాలకు డబ్బు కట్టించుకున్నారు. డబ్బు కట్టకపోతే ధాన్యం తీసుకునే పరిస్థితి లేకపోవడంతో అప్పు చేసి సొమ్ము చెల్లించారు.'

- ఖరీఫ్ ధాన్యం అమ్మకాల్లో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ముప్పతిప్పలు పెట్టిన మిల్లర్లు.. ఎదురు డబ్బు చెల్లించిన అన్నదాత
- తేమ, తూకం తదితర సమస్యలతో రైతన్న ఉక్కిరిబిక్కిరి
- రబీ పంట పరిస్థితిపై ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న పల్లపోతుల రెడ్డియ్య, పూర్ణచంద్రరావులే కాదు. గడచిన ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించిన మూడొంతుల మంది రైతులు ఇదేవిధంగా ముందుగా మిల్లర్లకు డబ్బు చెల్లించి ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి రెండు జిల్లాల్లోనూ కొనసాగింది. నూతన ధాన్యం కొనుగోలు విధానంలో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో 3.79 లక్షల టన్నుల ధాన్యం, పశ్చిమగోదావరి జిల్లాలో 3.76 లక్షల టన్నుల ధాన్యం రైతులు విక్రయించారు. ఖరీఫ్ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పంట మాసూళ్లు చేసిన తర్వాత రైతుభరోసా కేంద్రం వద్దకు వెళ్లి ఆన్‌లైన్ చేసుకోవడం, గోనె సంచులు సరిగా ఇవ్వకపోవడం, వారం, పది రోజులపాటు లారీలో రాకపోవడం, తేమశాతం, తూకం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిల్లర్లు రైతులను ముప్పుతిప్పలు పెట్టారు. రైతుభరోసా కేంద్రం అధికారులు నిబంధనలకు అనుగుణంగా తేమ 17 శాతం ఉండటం నిర్ధారించేవారు. తీరా మిల్లు వద్దకు వెళ్లాక తేమశాతం 18, 19 ఉందంటూ పాయింట్‌కు రూ.పది చొప్పన రైతుల నుంచి డబ్బు వసూలు చేసేవారు. డబ్బు ఫోన్‌పే చేస్తేనే లారీలో ధాన్యం దింపుకునేవారు. లేకపోతే ఎన్ని రోజులైనా లారీలో ధాన్యం అలానే ఉంచేసేవారు. అధికారులు నిర్ణయించిన వేబ్రిడ్జి వద్ద తూకం సరిగా వచ్చినప్పటికీ మిల్లు వద్ద తూకం తగ్గిందని కిలోకు రూ.20 వసూలు చేశారు. ధాన్యం విక్రయించిన ప్రతి రైతూ డబ్బు ఎదురు చెల్లించాల్సి వచ్చేది. ధాన్యం కిరాయి రూ.రెండు వేలకు మాట్లాడితే మిల్లు వద్ద ధాన్యం తీసుకెళ్లిన లారీ, ట్రాక్టర్ ఒకరోజు అదనంగా ఉంటే మరో రూ.రెండు వేలు కిరాయి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం పొలంలో నుంచి గట్టుమీదకు, అక్కడి నుంచి మిల్లుకు ఇలా రెండుసార్లు ఎగుమతి, దిగుమతి పేరుతో అదనంగా ఖర్చు చేయాల్సి పరిస్థితి వచ్చింది. ధాన్యం సొమ్ము 21 రోజులకు చెల్లించాల్సి ఉండగా నెలలు తరబడి చెల్లించని దుస్థితి కొనసాగింది. ఎదురు డబ్బు చెల్లించి ధాన్యం అమ్ముకోవడం ఏమిటని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రబీలోనూ ఇదే విధానం కొనసాగితే పరిస్థితి ఏమిటనే ఆందోళన అన్నదాతను వెంటాడుతోంది. నూతన కొనుగోలు విధానంలో సమస్యలను పరిష్కరించి రబీలో ధాన్యం కొనుగోలు చేయకపోతే సాగు చేయడం ఇక మానుకోవాల్సిందేనని చర్చ రైతుల్లో నడుస్తోంది. ధాన్యం కొనుగోలు విధానంలో మిల్లర్ల దోపిడీని అరికట్టకపోతే రబీలోనూ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. ప్రభుత్వం రబీలో ధాన్యం కొనుగోలులో ఎటువంటి చర్యలు చేపడుతుందో వేచిచూడాలి.

గ్యాస్ ధర తగ్గించాలంటూ..

సిలెండర్లు రోడ్డుపై పెట్టి.. గరిటెలతో వాయిస్తూ..
ఐద్వా ఆధ్వర్యాన మహిళలు వినూత్న నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ గానుగలపేటలో మహిళలు ఇళ్లలోని గ్యాస్ సిలెండర్లు రోడ్డుపై పెట్టి గరిటెలతో వాయిస్తూ వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలెండర్ ధర రూ.400 నుండి రూ.1200కు పెంచిందని, ఫలితంగా కట్టెల పొయ్యికి వెళ్లే మహిళల కంట కన్నీళ్లొస్తున్నాయని వాపోయారు. పెంచిన గ్యాస్ ధర తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలవ్వగానే బిజెపి గ్యాస్ ధర పెంచిందని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఇందిర, రాజేశ్వరి, ఉషారాణి, వెంకటరమణ, శైలాని, జి.లక్ష్మీశారద, సారికి చిన్నమ్మ, సరిత కోమల, నదుపూరి పద్మ, మోటూరి జయశ్రీ, సిఐటియు నాయకులు జె.గోపీ, జాన్‌బాబు పాల్గొన్నారు.



ఏలూరులో సిలిండర్లను గరిటెలతో కొడుతున్న మహిళలు

కట్టెల పొయ్యిపై వంటావార్పు

బుట్టాయగూడెం: పెంచిన గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మూడు రాష్ట్రాల ఎన్నికలు పూర్తవ్వగానే గ్యాస్ భారం మోపడం బిజెపికే చెల్లిందన్నారు. ఇప్పటికే సామాన్య ప్రజలు నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్నారని, గ్యాస్ బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే పెరిగిన గ్యాస్ ధరను తగ్గించాలని పెద్ద ఎత్తున నినదించారు. తొలుత సిపిఎం కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు ఉడతా వెంకటేశ్వరరావు, తామా ముత్యాలమ్మ, నాగమణి. జిల్లా కమిటీ సభ్యులు మంగరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో కట్టెల పొయ్యిపై వంటావార్పు

పచ్చి కూరగాయలే తినాలా అంటూ..

గణపవరం: పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని, లేనిపక్షంలో పచ్చి కూరగాయలే తినాల్సి వస్తుందంటూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కేశవరం వంతెన వద్ద పచ్చికూరగాయలు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బి.ఎర్రినాయుడు, వీరవల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో కాయగూరలతో నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద ఆరోగ్య శాఖ సిబ్బంది

భ్రూణ హత్యలను నివారించాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

లింగ వివక్ష నిర్మూలన, జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్‌ఆర్ పేటలో 'స్ట్రీట్ వాక్' కార్యక్రమం నిర్వహించారు. అక్కడి ప్రయివేటు స్కానింగ్ సెంటర్లను, ఆసుపత్రులను డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశ, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, యుపిహెచ్‌సి, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు కొన్ని స్కానింగ్ సెంటర్లను సందర్శించారు. ఆంధ్రా హాస్పిటల్, వంశీ స్కాన్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్టులు పరిశీలించినట్లు డిఎంహెచ్‌ఒ ఆశ తెలిపారు. భ్రూణ హత్యలను నివారించాలని నినదిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ మట్లాడుతూ అనుమతి లేని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఎంఒ నాగరత్నం, లీగల్ అడ్వయిజర్ రవి, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, ఎంవి.సుబ్బలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరుకు బస్సు నడపాలి: సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు నుండి జిల్లా కేంద్రం ఏలూరుకు తక్షణం ఆర్‌టిసి బస్సు నడపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల విస్తృత సమావేశం నారపల్లి రమణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లింగరాజు మాట్లాడుతూ 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం ఏలూరుకు నిడమర్రు నుంచి బస్సు సౌకర్యం కల్పించకపోవడం వల్ల వివిధ తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బస్సు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో రోడ్లు, తాగునీరు, డ్రెయిన్ల సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నేతలు గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, కంచం ప్రసాద్, నారపల్లి పద్మావతి, లావేటి చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గనిన వీరాంజనేయులు

ఎంఎల్‌సిగా చంద్రశేఖర్‌ను గెలిపించాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎంఎల్‌సి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న వీరవల్లి చంద్రశేఖర్‌ను గెలిపించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. శుక్రవారం సూర్య కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రశేఖర్‌కు టిడిపి పూర్తి మద్దతిస్తుందన్నారు. వైసిపి ఆగడాలను అరికట్టాలంటే పార్టీలకు అతీతంగా చంద్రశేఖర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల నిధులు పూర్తిగా పక్కదారి పట్టించారన్నారు. చింతలపూడి టిడిపి అభ్యర్థి నిర్ణయం చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళి, టిడిపి పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, కౌన్సిలర్ రమాదేవి, నంబూరు రామచంద్రరాజు, రూరల్ అధ్యక్షులు సాయిల సత్యనారాయణ, ఆకుమర్తి రామారావు, కుక్కల మాధవరావు, రాజపాల్, సౌభాగ్యవతి పాల్గొన్నారు.

నేడు చింతలపూడి రానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

చింతలపూడి: సిపిఐ పోరుబాటలో భాగంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం పరిశీలిస్తారని ఆ పార్టీ మండల సహయ కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం చింతలపూడిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను, అనంతరం చింతలపూడి ఎత్తిపోతల పథకం సందర్శిస్తారని చెప్పారు.

రైతు రుణ విమోచన చట్టం తప్పనిసరి

రుణాలు మాఫీ చేసి సమగ్ర పంటల బీమా అమలు చేయాలి
ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి రైతాంగం తరలిరావాలి - ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర ప్రభుత్వం రైతు రుణ విమోచన చట్టం తెచ్చి రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 5 నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేట్ కంపెనీలకు రుణాలు మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ నష్టాలతో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. మెట్టప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతులకు ప్రయివేటు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలన్నారు. గోదావరి ఆయకట్టు పరిధిలో శివారు ప్రాంత భూములకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ధాన్యం బకాయిలు పూర్తిగా చెల్లించాలని కోరారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై దశలవారీ ఆందోళన చేపడుతున్నామని చెప్పారు. ఈ ఆందోళనల్లో రైతాంగం భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, అనుమోలు మురళీ, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, గండి రాజా, ఎన్.శేషగిరిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

సమిష్టి కృషితో వ్యాధులు దూరం

అక్కుపల్లి గోకవరంలో మలేరియా నివారణ జిల్లా అధికారి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సమిష్టి కృషితో దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని మలేరియా నివారణ జిల్లా అధికారి పిఎస్‌వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని అక్కుపల్లిగోకవరంలో మలేరియా పాజిటివ్ కేసు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆయన ఆ గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో 250 మందికి రక్త పరీక్షలు చేశామని, అన్నీ నెగిటివ్ వచ్చాయని తెలిపారు. గొర్రెల కాపు కోసం రంపచోడవరం తదితర ఏజెన్సీ ప్రాంతాలకు అక్కుపల్లిగోకవరం వ్యక్తి వెళ్లొచ్చిన అతనికి అక్కడే మలేరియా సోకిందన్నారు. మండలంలో ఎక్కడా ఎలాంటి కేసులూ లేవన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి కలిదిండి సుబ్బరాజు వర్మ, తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుము తీతలు

తెగుళ్ల కారణంగా తగ్గిన దిగుబడులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మినుము తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో రెండో పంట దాళ్వా సాగు లేకపోవడంతో రైతులు మినుము సాగు చేపట్టారు. ప్రస్తుతం మినుము పంట కోతకు రావడంతో పది రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో మినుము తీత పనులు సాగుతున్నాయి. రైతులు కూలీలతో మినుము తీత పనులు చేయిస్తున్నారు. పలు గ్రామాల్లో మినుము పంట తీత పనులు ఒకపక్క జరుగుతుండగా, మరికొన్ని గ్రామాల్లో తీసిన మినుమును నూర్పిడి చేసే పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం రైతులు, కూలీలు పనుల్లో తలమునకలై ఉన్నారు. రెండు పూటల పని చేసే కూలీకి కూలి సొమ్ముగా రూ.500 చెల్లిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు ఆటో ఛార్జీలకు అదనంగా రూ.50 నుంచి రూ.వంద వరకూ ఇస్తున్నారు. మండలవ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో మినుము సాగు రైతులు చేపట్టగా 40 శాతం వరకు మినుము తీతలు జరిగినట్లు మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ చెప్పారు. గతేడాది మినుము సాగు ఆశాజనకంగా ఉన్నా ఈ ఏడాది తెగుళ్ల కారణంగా కొంతమేర దిగుబడులు తగ్గాయన్నారు. ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకూ దిగుబడులు వస్తున్నట్లు చెప్పారు.



మినుము తీత పనుల్లో వ్యవసాయ కార్మికులు

దామాషా ఎన్నికలతో సుపరిపాలన సాధ్యం

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

దామాషా పద్ధతిలో ఎన్నికల నిర్వహణ ద్వారా సుపరిపాలన సాధ్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎన్.భాస్కరరావు అన్నారు. మండలంలోని పెరిగ్గూడెంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఓటుహక్కు సక్రమ వినియోగంపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలన్నీ డబ్బు ప్రమేయంతోనే జరుగుతున్నాయని విమర్శించారు. డబ్బు ఖర్చు పెట్టని వారు ఎన్నికల్లో గెలిచే పరిస్థితులు లేవన్నారు. దీంతో రాజకీయమంతా వ్యాపారంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజాశ్రేయస్సు కోరే మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితులు కన్పించడం లేదన్నారు. దీనికి కారణం మనం అనుసరిస్తున్న ఎన్నికల విధానమేనని చెప్పారు. ప్రధానంగా రెండు తరహా ఎన్నికల వ్యవస్థలు ఉండగా అందులో ఒకటి ఇప్పుడు మనం అనుసరిస్తున్న ఫస్ట్ పాస్ ది పోస్ట్ (ఎఫ్‌పిటిపి), రెండోది దామాషా పద్ధతి అని తెలిపారు. దామాషా ఎన్నికల విధానం 85 దేశాల్లో అమలులో ఉందన్నారు. ప్రస్తుతం మనం అనుసరిస్తున్న ఎన్నికల విధానం ఒక ఓటు ఎవరికి ఎక్కువ వస్తే వారే గెలిచినట్లని, మిగిలిన వారు ఓడినట్లని, ఓడిన వారికి వచ్చిన ఓట్లకు విలువ ఉండదని తెలిపారు. అందువల్ల మెజారిటీ గెలుపు కోసం పార్టీలు డబ్బును విరజిమ్మి ఓట్లను కొనుగోలు చేస్తున్నారని ఆయన అన్నారు. గెలిచిన తర్వాత ఎన్నికల్లో తాము ఖర్చు చేసిన సొమ్ముకు రెండింతలు సంపాదించుకోవడం కోసం ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారని విమర్శించారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే ఆ విధానంలో ప్రజలు పార్టీలకే ఓటు వేస్తారని, ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో ఆ పార్టీకి అన్ని సీట్లు వస్తాయని, పార్టీ ప్రకటించిన జాబితా వరుస క్రమంలో అభ్యర్థులు చట్టసభల్లో సభ్యులవుతారని వివరించారు. ఈ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తే డబ్బు ఖర్చు చేసినా అంత ఫలితం ఉండదని, ఫలితంగా డబ్బు ఖర్చు చేయడానికి పార్టీలు ముందుకు రావని అన్నారు. దీంతో ఎన్నికలలో డబ్బు ప్రమేయం తగ్గిపోతుందని, ప్రజలకు సేవ చేసే మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తారని, అందువల్ల రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పెరుమాళ్ల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఓటును నోటుకు, మద్యానికి, కులమతాలకు అతీతంగా విచక్షణా జ్ఞానంతో వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు.




ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా : డిఎస్‌పి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించామని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కెవి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం వేగవరంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల అనర్థాలు.. నిర్మూలన ఆవశ్యకతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో పోలీసు శాఖ ముందుకెళ్తోందన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆరోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలో విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాలను అమ్ముతున్నా, సేవిస్తున్నా వారి వివరాలను టోల్‌ఫ్రీ నెంబర్ 14500కుగాని, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లోగాని తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డిఎస్‌పి చెప్పారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సాగర్‌బాబు, నోవా ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి సత్యనారాయణ

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై మరింత భారాన్ని మోపిందని, వంటగ్యాస్ ధరను ఏకంగా రూ.50 పెంచిందని సిపిఎం మండల కమిటీ సభ్యులు కొమ్ము ఆనందం కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వ్యవసాయ కూలీల కూలి రేట్లు మాత్రం పెరగడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు మేడేపల్లి హెూలీ మేరీ అన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తగ్గించాలని, లేకపోతే మండల స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి జగన్మోహనరావు

ఆడపిల్లలను చదివించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రస్తుతం సమా జంలో ఆడపిల్లల పాత్ర ఎంతో అమోఘమని, వారిని రక్షించటంతో పాటు చదివించటానికి సైతం ప్రతిఒక్కరూ పాటు పడాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జె.జగన్మోహనరావు అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆగిరిపల్లి పుర వీధుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ లక్ష్మయ్య, ఎస్‌బిఐ మేనేజర్ ఎస్.సునీల్, ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, టిడిపి నాయకులు ఎం.గోపాల్, ఎఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

44 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక నాలుగో సచివాలయం వద్ద కంటివెలుగులో భాగంగా శుక్రవారం 44 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 42 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. అనంతరం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 210 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు వైద్యులు పి.సంతోషనాయుడు, పి.కిరణ్మయి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు, ఆరోగ్య సహాయకులు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.యేహన్ పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర ప్రారంభం

చాట్రాయి : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ పిలుపుమేరకు మాదిగల సంగ్రామ పాదయాత్ర శుక్రవారం చాట్రాయి మండలంలో ప్రారంభమైంది. మండలంలోని చనుబండలో డాక్టర్ బాబు జగజ్జీవన్‌రావు, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు ఎన్‌టిఆర్ జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యంద్రాతి కోటేశ్వరరావు మాదిగ పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం పరిధిలోని మెట్టగూడెం గ్రామానికి చెందిన నూతి సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సత్యనారాయణ జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరపున రూ.ఐదు లక్షలు బాధిత కుటుంబానికి జనసేన పార్టీ మంజూరు చేసింది. ఆ నగదు చెక్కును శుక్రవారం తాడేపల్లిగూడెంలో జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ బాధిత కుటుంబానికి అందించారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

పెదవేగి : ప్లాస్టిక్ వినియోగం వల్ల భయంకరమైన కేన్సర్ వంటి వ్యాధులు సోకి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పెదవేగి ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్ తెలిపారు. పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే వ్యాధులపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని బహిష్కరించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై కుటుంబ సభ్యులకు, గ్రామాల్లోని ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించాలని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

ముసునూరులో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిల్లు దగ్ధమైన ఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. రెవెన్యూ శాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన కంచర్ల ముత్తయ్య ఇంట్లో ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ముత్తయ్య కుమారుడు ఏడుకొండలు ఇంటికి వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.పది లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తహశీల్దార్ దాసరి సుధ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో కాపర్ వైర్ దొంగిలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన ముసునూరులో రేగుల గోపాలకృష్ణ వ్యవసాయ భూమిలో 1257 నెంబర్ కలిగిన 12 హెచ్‌పి మోటారుకు అమర్చిన 25 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోకి కాపర్ వైరు అపహరించుకుపోయారు. దీనిపై గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గుర్తు తెలీని వాహనం ఢీకొని ఉపాధ్యాయుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం... మండలంలోని వంకవారిగూడెం గ్రామానికి చెందిన చాపర్ల నారాయణ (41) గురువారం అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నుంచి స్వగృహానికి వెళ్తుండగా కాకతీయ గేట్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం తెలిపాయి.

జీలుగుమిల్లిలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ఆర్‌టిఎ చెక్ పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆర్‌టిఎ, రెవెన్యూ వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఫారెస్ట్ చెక్ పోస్ట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.5.26 లక్షల అపరాధ రుసుం వసూలు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌పి కరణం కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో సిఐ శివరామకృష్ణ, ఎఎంవి ఐ కల్యాణి, ఎఫ్ఎస్‌ఒ ధర్మారావు, ఎఎంసి సూపర్‌వైజర్ మల్లయ్య, సిబ్బంది హరి, రాఘవులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వివాహిత అదృశ్యమైన సంఘటన నూజివీడు మండలంలో చోటుచేసుకుంది . రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేంపాడు అగ్రహారానికి చెందిన రౌతు మమత(27) గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త వెంకటరమణ శుక్రవారం ఉదయం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై గుంతలు.. ప్రమాదాల నిలయాలు

కల్వర్టు కోసం తవ్వుతున్న వైనం
ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
కాంట్రాక్టర్ నిర్లక్ష్యమని విమర్శలు
పట్టించుకోని అధికారులు



రోడ్డుపై గుంట కారణంగా బోల్తా పడిన కారు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోకి దాకారం వద్ద కల్వర్టు కోసం తవ్విన గుంటలో ద్విచక్ర వాహనం పడి సూరపనని రంగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది... కల్వర్టు కోసం తవ్విన గుంట కారణంగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిన సంఘటనలో కారు ధ్వంసం కాగా ఐదుగురు గాయాలపాలయ్యారు. భైరవపట్నం అగ్రహారం వద్ద కల్వర్టు కోసం తవ్విన గుంటలో ద్విచక్ర వాహనం పడి ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రత్తిపాడు సెంటర్ వద్ద కల్వర్టు కోసం తవ్విన గుంట కారణంగా కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. ఇలా కల్వర్టులను ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారి మధ్యలో గుంటలను తవ్వడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల అలసత్వం తోడవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి పామర్రు దిగమర్రు 165 పామర్రు నుంచి ఆకివీడు వరకు అభివృద్ధి చేసే విధంగా కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కల్వర్టు పనులను ప్రారంభించి నిర్వహిస్తున్నాడు. కల్వర్టు నిర్మించే ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించకుండా వాహనదారులు నెమ్మదిగా జాగ్రత్తగా వెళ్లాలని తెలియచేసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తవ్వుతున్న గుంటలు వాహనదారుల పాలిట మృత్యు శకటాలుగా మారుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు కనీసం సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అధికారుల తీరుపై వాహనదారులు సర్వత్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించకుండా చూడడంతో పాటు ప్రమాదాలకు కారణమైన కాంట్రాక్టర్‌పై, కాంట్రాక్టర్‌కు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ డిఇ సత్యనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ : వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మండలంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన ఎ.రవి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందన్నారు. రైల్వే, ఎల్ఐసి, స్టీల్ ప్లాంట్, విమానాశ్రయాలను, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడానికి కేంద్రం ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పట్ల అత్యంత నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందన్నారు. సమస్యలన్నిటిపై ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, మండల కార్యదర్శి ఉడత వెంకటేష్, బోరగం భూ చంద్రం, కె.దుర్గారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని కాలేజీ శాశ్వత ప్రిన్సిపల్‌గా నియమితులైన పి.నిర్మలాకుమారి అన్నారు. శుక్రవారం కాలేజీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శాశ్వత ప్రిన్సిపల్‌గా నియమించిన కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వారం రోజుల పాటు ఢిల్లీలో జరిగిన శిక్షణ తమ కాలేజీ విద్యాభివృద్ధికి ఉపగపడుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో కాలేజీ అభివృద్ధికి ఎప్పటిలాగే అభివృద్ధి మండలి కార్యదర్శి కాకర్ల శ్రీనివాస్, సభ్యులు చింతలపాటి వెంకటసత్యనారాయణరాజు, నడపల్లి శ్రీరామ్‌చ తమ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో లెక్చరర్లు టి.అక్కిరాజు, కె.స్వరూపరాణి, శ్రీనివాసరావు, డాక్టర్ చైతన్య, డివివి.చినసత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ సారధులకు శిక్షణ

ప్రజాశక్తి - గణపవరం

పార్టీని బలోపేతం చేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేది గృహ సారధులేనని ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మండలంలోని పిప్పర, మొయ్యేరు, వీరేశ్వరపురం, వాకపల్లి, ఎ.గోపవరం గ్రామాలకు చెందిన గృహ సారధులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సిఎం జగన్ వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

భుజబలపట్నంలో వైసిపి నేతల పర్యటన

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని భుజబలపట్నంలో వైసిపి నేతలు శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని శ్రీ ఆదివినాయక స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ, సయ్యపరాజు గుర్రాజు, ముంగర నరసింహరావు, సర్పంచి గురజాల వేణు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణుని ఆలయంలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు వేల మందికి అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీను, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కునూరి గోపాలకృష్ణ, రాష్ట్ర మహిళా మండలి అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

వరి సాగు చేస్తున్నవారికి ఏప్రిల్ 15 వరకు గడువు

ఉంగుటూరు : మండలంలోని యర్రమిల్లి పాడులో పంచాయతీకి చెందిన 26.09 ఎకరాల్లో నాలుగు చెరువులు ఉన్నాయి. అందులో 11.90 ఎకరాలు 28 మంది ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. పశువుల పాకలు, షెడ్డులు, చెరువు గర్భంలో వరి, తదితర సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో పంచాయ ఎతీ ఆధీనంలోని చెరువుల స్థలాల్లో ఆక్రమణలను ఖాళీ చేయించాలని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 28 మందికి నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దారు ఎవి.రమణరావు, పంచాయతీ విస్తరణఅధికారి షేక్ షంషుద్దీన్, చేబ్రోలు ఎస్ఐ కె.స్వామి, పంచాయతీ కార్యదర్శి యాళ్ల కిషోర్‌బాబు, సచివాలయ ఉద్యోగులు, పోలీసు బందోబస్తుతో 8.20 ఎకరాల్లో 21 మంది ఆక్రమణలను జెసిబి సాయంతో తొలగించారు. ఇంకో 3.69 ఎకరాల్లో ఏడుగురు వరి సాగుచేస్తున్నారని ఏప్రిల్ 15 తేదీ దాటాక పంట చేతికి వచ్చాక తామే స్వచ్ఛందంగా ఖాళీ చేస్తామని చెప్పటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ రైతులకు అవకాశం ఇచ్చామని ఇఒపిఆర్‌డి తెలిపారు. ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు చెరువులను మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద అభివృద్ధి చేయను న్నామని చెప్పారు. ఎలాంటి ప్రతిఘటనలు రాకుండా ఆక్రమణదారులే స్వచ్ఛందగా ముందుకు వచ్చి సహకరించారని అధికారులు తెలిపారు.

మాపై కక్ష సాధింపు చర్యలు ఆపండి

ఉపాధి హామీ సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ఉపాధి హామీ ఎపిఒ సోమేశ్వరి తమపై కక్ష సాధింపుగా వేతనాలు కోత విధిస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌టిలకు రూ.12 వేలకు మూడు వేల లోపు, సీనియర్ మేట్లకు రూ.11 వేలకు రూ.నాలుగు వేల లోపు వేతనాలను ఇచ్చి అవస్థలు పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నిస్తే రాజకీయ నేతలను ఉసిగొల్పుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. దీనిపై డ్వామా పీడీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

పని దినాలతో వేతనాలకు లింకా?

పని దినాలు లేని కారణంగానే వేతనాలలో కోత విధిస్తున్నట్లు ఎపిఒ కుంటి సాకులు చెప్పడం సరికాదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు కోత విధించమని ఆదేశాలు ఇచ్చారని ఎపిఒ చెప్పే సమాధానంలో ఏ మాత్రం నిజం లేదంటున్నారు. డ్వామా పీడీ, మండల పరిషత్‌ల నుంచి ఈ మేరకు ఏ విధమైన ఉత్తర్వులు రాలేదని, కేవలం కొందరిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఎఫ్‌టిలుగా ముగ్గురు విధులు నిర్వర్తిస్తుండగా రూ.12 వేల వేతనం చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేల లోపు, సీనియర్ మెట్లకు రూ.10 వేలు, రూ.11 వేలు ఇవ్వాల్సి ఉండగా వారికి కూడా కేవలం రూ.1500 నుంచి రూ.నాలుగు వేలు అందించడం దారుణమని వాపోతు న్నారు. వేతనాల కోత విధిస్తే భార్యా పిల్లలను ఎలా పోషిం చాలని, కుటుంబాలు రోడ్డున పడటం మినహా మరో దారి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నిస్తుంటే పరపతి ఉపయోగించి రాజకీయ నేతలను ఉసిగొల్పుతున్నట్లు వాపోతున్నారు. ఉపాధి సిబ్బందికి జిల్లాస్థాయి ఉన్నతాధికారులు అండగా నిలవాలని కోరుతున్నారు.

బాలయోగి వర్థంతి సభలు

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం భీమడోలులో నిర్వహిం చారు. తొలుత సంతపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాచప్రోలు రాజకపూర్ ఆధ్వ ర్యంలో బాలయోగి సంస్మరణార్థం భీమడోలులోని బాలికల వసతి గృహం, అనాధ పిల్లల ప్రత్యేక వసతి గృహం ఆనంద భవనంలోని బాలికలకు పరీక్షలకు హాజయ్యేందుకు రాత అట్టలు, పెన్నులు అందించారు. వీటికి అదనంగా పరీ క్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్సులను పంపిణీ చేశారు.

కైకలూరు : లోక్‌సభ తొలి దళిత స్పీకర్‌గా సేవలందించిన జిఎంసి బాలయోగి చిరస్మరణీయులని పలువురు టిడిపి నేతలు అన్నారు. బాలయోగి వర్ధంతి సందర్భంగా కైకలూరు తాలుకా సెంటర్‌లో ఆయన విగ్రహానికి టిడిపి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు వాసిపల్లి సతీష్ ఖన్నా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు పి.త్రినాథరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యురాలు విజయలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీరాణి, ఎస్‌సి సెల్ జిల్లా నాయకులు మత్తే మేజర్ నర్సింహులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ తమకు ఉన్న దానిలోనే పేదవారికి, అనాధలకు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని రాజీవ్ థామస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారుమూడి థామస్ అన్నారు. మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో శుక్రవారం రాజీవ్ థామస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఆర్థిక సాయంతో నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం ఆధ్వర్యంలో వంద మంది వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, రాష్ట్ర మహిళా అంగన్‌వాడీ కార్యదర్శి ముళ్లగిరి సుందరమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

జంగారెడ్డిగూడెం : ఉపాధి హామీ వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షురాలు యాగంటి సీత డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఉపాధి హామీ సమస్యలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా యాగంటి సీత మాట్లాడుతూ మండలంలోని రెండు నెలలపాటు చేసిన ఉపాధిహామీ పనుల వేతన బకాయిలు రూ.50 లక్షలు వరకు ఉన్నాయని తెలిపారు. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆనందరామకృష్ణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సర్ సిఆర్‌ఆర్ కళాశాలలో అనతికాలం ఫిజిక్స్ హెడ్‌ఆఫ్ డిపార్ట్‌మెంట్ లెక్చరర్‌గా పని చేసిన ఆకుల ఆనంద రామకృష్ణ ఆకస్మిక మృతి తీరని లోటని సర్ సిఆర్‌ఆర్ లెక్చరర్లు అన్నారు. కళాశాల ఆడిటోరియంలో ఆకుల ఆనందరామకృష్ణ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ఆయన చేసిన సేవల గురించి స్మరించుకున్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

గణపవరం : మండలంలోని కొత్తపల్లి, సిహెచ్.అగ్రహారం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు స్థానిక పంచాయతీ కార్యదర్శులు తడి, పొడి చెత్తపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీటిపై అవగాహన ఉంటే పారిశుధ్యం మెరుగుపడుతుందని పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, శ్రీనివాస్ అన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కైకలూరు : గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆటపాకలో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని ఆచరణలో పెడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు.

పలుచోట్ల గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజల సంక్షేమం కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు ప్రవేశపెట్టారని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బలివే గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి అందుబాటులో ఉండేలా వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బలివే సర్పంచి లావు ప్రవీణా సుధాకర్, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనా, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జి.రాణి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఎంఎల్‌ఎ ఉన్నమాట్ల ఎలిజా సూచించారు. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ ఎలిజాను ఇటీవల వైసిపి నామినేటెడ్ పదవులను అలంకరించిన జిల్లా నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

దోమలను నిర్మూలించాలి

ఏలూరు టౌన్ : దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వామి కావాలని, దోమలు మానవాళికి పెనుము పెనుముప్పుగా పరిణమించాయని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.ఆశ సూచించారు. శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఏలూరు రామచంద్రరావు పేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమలో డిఐఒ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు పాల్గొన్నారు.